సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 26 । జూన్ । 2025



మద్యం రాసిన మరణ శాసనం
మద్యం ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. కూటమి సర్కార్ విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగిస్తుండగా.. బానిసలవుతున్న వారు జీవితాలను కోల్పోతున్నారు. 8లో



సోషల్ మాయలో పడొద్దు
విద్యార్థులు సోషల్ మీడియా మాయలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్పీ రత్న సూచించారు. కొత్తచెరువు జెడ్పీ హైస్కూల్‌లో బాలికలకు అవగాహన కల్పించారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.3°/23.2°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 16 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

మా వాహనాలకు క్లియరెన్స్ ఇప్పించండి

- పౌరసరఫరాల కమిషనర్‌ను కోరిన ఎండీయూ ఆపరేటర్లు



పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్‌గౌర్‌ను కలిసి వినతిపత్రం అందిస్తున్న ఎండీయూ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు

ధర్మవరం: రేషన్ బియ్యం పంపిణీ నుంచి తమను తప్పించినందున వెంటనే తమ వాహనాలకు క్లియరెన్స్ ఇప్పించాలని ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కోరారు. ఈ మేరకు వారు విజయవాడలోని సెక్రటేరియట్‌లో పౌరసరఫరాల కమిషనర్ సౌరబ్‌గౌర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కిశోర్, సూర్యనారాయణ, రవికుమార్, సతీష్, దేవసహాయం, సుధాకర్‌రెడ్డి, సాంబశివరావు, రామంజనేయులు, సునీల్, వెంకట్, కేశవ, అక్బర్, హరి, కమలాకర్, ప్రతాప్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ...ప్రజలకు ఉపయోగపడే ఎండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో వాహనాలపై ఆధారపడిన ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా మంది జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఎండీయూ వ్యవస్థను ఎలాగూ రద్దు చేసినందున తమ వాహనాలకు క్లియరెన్స్ ఇప్పించడంతో పాటు బకాయిలను వెంటనే ఇప్పించాలని కోరారు. అలాగే తమకు ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపించాలని కోరారు. తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు.

ఆర్‌ఎస్‌కే సిబ్బంది బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

అనంతపురం సెంట్రల్: రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) సిబ్బంది బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఐదేళ్లు పూర్తయిన వారికి ఆఫ్‌లైన్‌లో, ఐదేళ్లలోపు సిబ్బంది రిక్వెస్ట్ బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రిక్వెస్ట్ బదిలీ ఉద్యోగులను వారి సొంత మండలంలో కాకుండా ఇతర మండలాల్లో పోస్టింగ్ కల్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్ తేదీలు ఖరారు చేసే పనిలో ఆయా శాఖల అధికారులు నిమగ్నమయ్యారు. ఉమ్మడి జిల్లాలో 867 రైతు సేవా కేంద్రాలున్నాయి. అనంతపురం జిల్లాలో 126 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 124 మంది విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. వీరిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న వారు 'అనంత'లో 101 మంది, 'శ్రీ సత్యసాయి'లో 102 మంది ఉన్నారు. హార్టికల్చర్ అసిస్టెంట్లు 'అనంత'లో 180 మంది, 'శ్రీ సత్యసాయి'లో 143 మంది ఉండగా అందరికీ ఐదేళ్లు పూర్తయ్యాయి. ఇక.. ఐదేళ్లు పూర్తి చేసుకున్న సెరికల్చర్ అసిస్టెంట్లు 'అనంత'లో 12 మంది, శ్రీ సత్యసాయిలో 73 మంది ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పశు సంవర్ధక శాఖకు సంబంధించి 666 మంది వెటర్నరీ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు.

సీఎం పర్యటనకు స్థల పరిశీలన



కొత్తచెరువు జూనియర్ కళాశాల మైదానంలో అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు జూలై 5వ తేదీన కొత్తచెరువుకు రానున్నట్లు జిల్లా అధికారులకు ప్రాథమిక సమాచారం అందింది. ఈ నేపథ్యంలో బుధవారం ఎస్పీ రత్న అధికారులతో కలిసి కొత్తచెరువులో పర్యటించారు. 'తల్లికి వందనం' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ జూలై 5వ తేదీన కొత్తచెరువుకు రానున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి సమావేశంతో పాటు బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. దీంతో బహిరంగ సభ కోసం కొత్తచెరువు జూనియర్ కళాశాల మైదానాన్ని ఎస్పీ రత్న పరిశీలించారు. మైదానాన్ని త్వరితగతిన చదును చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ విజయకుమార్, సీఐలు బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, నరేష్ మారుతీ శంకర్, తహసీల్దార్ బాలాంజనేయులు, ఎంఈఓ జయచంద్ర ఉన్నారు.

లక్షణంగా వెనక్కి!



- కలగానే బీఎస్‌ఎన్‌ఎల్ పూర్వవైభవం
- అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేని సంస్థ
- పెరిగిన కస్టమర్లను నిలుపుకోలేని వైనం
- అనంతపురం జోన్‌లో లక్ష మందికి పైగా సర్వీసు నుంచి బయటకు

❏ అనంతపురానికి చెందిన మురళీమోహన్‌రెడ్డి 20 ఏళ్లుగా బీఎస్‌ఎన్‌ఎల్ నంబర్ వాడుతున్నారు. సిగ్నల్ సమస్య వచ్చినా, నెట్‌వర్క్ సరిగా రాకపోయినా మరో నెట్‌వర్క్‌లోకి మారేందుకు ఇష్టపడలేదు. కానీ రానురాను సమస్య మరీ తీవ్రంగా మారింది. ఇన్‌కమింగ్ కాల్స్ కూడా రావడం లేదు. పైగా మిత్రులంతా ఎందుకని ఎప్పుడూ సెల్ స్విచాఫ్ చేసుకుని ఉంటావంటూ ప్రశ్నించడం మొదలు పెట్టారు. దీంతో మురళీమోహన్‌రెడ్డి కస్టమర్ కేర్‌కు ఫిర్యాదు చేశారు. ఫలితం లేదు. బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లి సమస్య వివరించినా ఫలితం లేకపోవడంతో ఇటీవల మరోనెట్‌వర్క్‌కు మారిపోయాడు.

❏ పుట్టపర్తికి చెందిన శ్రీరామ్ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేసేవాడు. సదరు సంస్థ 'సీయూజీ' సిమ్ ఇవ్వడంతో ఆ నంబర్ వాడేవాడు. కానీ మూడేళ్ల క్రితం ఆయన ఆ సంస్థ నుంచి బయటకు వచ్చాడు. కానీ ఆ నంబర్‌ను వదులుకోలేక పోయాడు. సంస్థను అభ్యర్థించి ఆ నంబర్ మరో నెట్‌వర్క్‌లో ఉంటే పోర్టబులిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్‌కు మారాడు. అప్పటి నుంచి అతనికి సమస్యలు మొదలయ్యాయి. సిగ్నల్ సరిగా లేక డాటా కూడా ఉపయోగించలేని పరిస్థితి నెలకొంది. ఎవరికి ఫిర్యాదు చేసినా సేవలు మెరుగుపడకపోవడంతో ఇటీవలే మరో నెట్‌వర్క్‌లోకి మారిపోయాడు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అవకాశాలు రాక.. వ్యాపారాలు లేక చాలా దిగ్గజ సంస్థలన్నీ నిరాశగా ఉండగా బీఎస్ఎన్ఎల్ మాత్రం అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయింది. ఒక దశలో లక్షలాది మంది కస్టమర్లు బీఎస్ఎన్ఎల్ కావాలని సిమ్‌లు తీసుకుంటే వారికి సర్వీసు ఇవ్వలేక చతికిల పడింది. సిగ్నల్స్ ఉండవు, ఫిర్యాదు చేస్తే పట్టించుకోరు, నెట్ సరిగా రాకపోవడంతో సిమ్‌కార్డు ఎందుకు తీసుకున్నాం రా బాబూ అంటూ వినియోగదారులు గగ్గోలు పెట్టిన పరిస్థితి. అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాల పరిధిలో ఎంతో ఆశగా బీఎస్ఎన్ఎల్ సిమ్‌లు తీసుకున్న సంతోషం నాలుగు నెలల్లోనే ఆవిరి అయిపోయింది.

టారిఫ్‌లు పెంచడంతో..

కొన్ని నెలల క్రితం జియో, ఎయిర్‌టెల్ వంటి ప్రైవేటు మొబైల్‌సర్వీస్ ప్రొవైడర్లు ఒక్కసారిగా నెలవారీ చార్జీలు పెంచాయి. దీంతో అనంతపురం జోన్ (కడప–అనంతపురం) పరిధిలో సుమారు 1.85 లక్షల మంది కస్టమర్లు బీఎస్ఎన్ఎల్ వైపు మొగ్గు చూపారు. దీంతో బీఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం వచ్చినట్టయింది. కానీ కస్టమర్ల సంతోషం ఎక్కువ రోజులు నిలవలేదు. సిమ్‌కార్డు తీసుకున్న వారంలోనే కష్టాలు మొదలయ్యాయి. మొబైల్‌కు సిగ్నల్స్ రాకపోవడం, నెట్‌సరిగా ఉండకపోవడం, సమస్యలు పరిష్కారం కాకపోవడంతో విసుగెత్తిపోయారు. పైగా సిబ్బందికి మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో కస్టమర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఇంకా 4జీనే..

అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలను ఒక జోన్‌గా పరిగణిస్తారు. ఇటీవల ఈ జోన్‌లో సుమారు 1.85 లక్షల మంది బీఎస్ఎన్ఎల్‌కు మారారు. దీంతో భారీగా బిజినెస్ పెరిగింది. సిమ్‌లు విచ్చలవిడిగా అమ్ముడయ్యాయి. కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయి. కానీ నెల రోజుల్లోనే నెట్‌వర్క్ సరిగా పనిచేయలేదు. కాస్త రూరల్‌కు వెళితే సిగ్నల్స్ లేవు. పైగా ప్రైవేటు సర్వీసు ప్రొవైడర్లు 6జీకి వెళుతుంటే బీఎస్ఎన్ఎల్‌లో 4జీనే సరిగా రాదు. దీంతో కస్టమర్లలో సుమారు 1.39 లక్షల మంది వెనక్కు వెళ్లిపోయారు. టవర్లు తక్కువగా ఉండటం, సర్వీసులను ఉన్నతీకరించక పోవడం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడి వెనక్కు వెళ్లినట్టు తెలుస్తోంది.

ప్రైవేటు ప్రొవైడర్లు చార్జీలు పెంచడంతో బీఎస్ఎన్ఎల్‌కు వచ్చిన వారు

అనంతపురం	1,05,000 పైగా
వైఎస్సార్ కడప	80,000 పైగా
అనంతపురం జిల్లాలో టవర్లు	450 వరకూ
వైఎస్సార్ కడప జిల్లాలో టవర్లు	350 వరకూ

సేవలు సరిగా లేక బీఎస్ఎన్ఎల్ నుంచి తిరిగి వెనక్కు వెళ్లిన వారు

1,39,000

ప్రస్తుతం రెండు జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు

6,00,000

అనుకున్నట్టే కానిచ్చేశారు!

- 2008, 1998 ఎంటీఎస్ టీచర్లకు వేర్వేరుగా బదిలీల కౌన్సెలింగ్
- 2008 టీచర్లకు కౌన్సెలింగ్ పూర్తి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ ప్రసాద్ బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇప్పటికే రెండుమార్లు వాయిదా పడ్డ ఎంటీఎస్ టీచర్ల బదిలీల అంశంలో అధికారులు కొత్త పంథా ఎంచుకుని అనుకున్నట్టే చేశారు. సీనియార్టీ జాబితాలో 2008 ఎంటీఎస్ టీచర్లు ముందున్నారు. వీరి తర్వాతనే 1998 ఎంటీఎస్ టీచర్లు మొదలవుతారు. ఖాళీలన్నీ దూర ప్రాంతాల్లో ఉండడం.. ఉన్న వాటిలో 2008 ఎంటీఎస్ టీచర్లకు కాస్తా మంచివి దక్కుతాయి. రెండు సార్లు వాయిదా పడడంలో 1998 ఎంటీఎస్ టీచర్ల పాత్ర ఎక్కువగా ఉందని నిర్ధయానికి వచ్చిన విద్యాశాఖ... ఎంటీఎస్ టీచర్ల మధ్య 'విభజించు–పాలించు' సూత్రాన్ని అమలు చేసింది. 2008, 1998 వారికి వేర్వేరుగా కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో డీఈఓ పేరుతో మెసేజ్ పంపారు. '2008 ఎంటీఎస్ టీచర్లకు మాత్రమే సాయంత్రం 5 గంటలకు కౌన్సెలింగ్' ఉంటుందని పేర్కొన్నారు.

గొడవతో ఉద్రిక్తత..

సాయంత్రం 5 గంటలకు వచ్చిన 2008 ఎంటీఎస్ టీచర్లు..జాబితాలోని 50 మందికి మాత్రమే మంచి స్కూళ్లు వస్తాయని, తక్కిన 147 మంది దూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని వాపోయారు. ఇలా రెండు గ్రూపులు విడిపోయి వాదించుకున్నారు. ఇక 'కౌన్సెలింగ్‌కు హాజరుకాకపోతే కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జనరేట్ అవుతాయి.. ఎవరికి ఎక్కడొస్తాయో మీ ఇష్టం' అంటూ విద్యాశాఖ సిబ్బంది బెదిరింపులకు దిగడంతో ఎంటీఎస్ టీచర్లు ఇరకాటంలో పడ్డారు. జాబితాలో ముందున్న వారు తాము కౌన్సెలింగ్‌లో పాల్గొంటామని చెప్పడంతో మరికొందరు అడ్డుకున్నారు. దీంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఎట్టకేలకు రాత్రి 7 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్ సజావుగా ముగిసింది. ఇక.. నేడో, రేపో 1998 ఎంటీఎస్ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.





ప్రభుత్వ భూముల్లో రెడ్డెప్పశెట్టి అక్రమంగా ఏర్పాటు చేసిన పాలీహౌస్‌లు

సర్దుకుంటున్న రెడ్డెప్పశెట్టి

- తప్పులు మెడకు చుట్టుకోవడంతో తప్పించుకునే ప్రయత్నం
- భూములన్నీ అమ్మకానికి పెట్టిన వైనం!
- లేపాక్షి హబ్ భూములు, ప్రభుత్వ భూములనూ విక్రయించేలా ప్లాన్

చిలమత్తూరు: నదిపై అక్రమంగా బ్రిడ్జి నిర్మించడం...ఈడీ అటాచ్ చేసిన లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములను స్వాధీనం చేసుకోవడం... ఉద్యానశాఖ ద్వారా అక్రమంగా పాలీహౌస్, ఫారంపాండ్లను మంజూరు చేయించుకోవడం... విద్యుత్ చౌర్యం.. ఇలా..రియల్టర్ రెడ్డెప్పశెట్టి అక్రమ బాగోతాలు అన్నీఇన్నీ కావు. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ ఆయన చేసిన అవినీతి, అక్రమాలను 'సాక్షి' వెలుగులోకి తేగా అధికారులూ చర్యలకు సిద్ధమయ్యారు. కేసులన్నీ ఒక్కొక్కటిగా మెడకు చుట్టుకుంటుండటంతో భూములన్నీ విక్రయించి పలాయనం చిత్తగించేందుకు రెడ్డెప్పశెట్టి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం ఇప్పటికే ఓ బడా రియల్టర్‌తో సంప్రదింపులు జరిపినట్టుగా సమాచారం. అయితే ప్రభుత్వ భూములను కలుపుకొని ధర చెప్పడంతో ఆ రియల్టర్ ఆలోచిస్తున్నట్టుగా తెలుస్తోంది.

ఎవిక్షన్ నోటీసు ఇవ్వగానే కోర్టుకు...

అక్రమాల్లో ఆరితేరిన రియల్టర్ రెడ్డెప్పశెట్టి.. ఏదైనా ఇబ్బంది కలిగినా తప్పించుకునేందుకు సైతం ముందే దారులు వెదికి ఉంచుకున్నారు. అందువల్లే అతనిపై అన్ని కేసులు నమోదైనా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు.

- చిత్రావతి నదిపై అక్రమంగా బ్రిడ్జి నిర్మించడంతో ఇరిగేషన్ అధికారులు చిలమత్తూరు పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. అనంతరం ఎవిక్షన్ నోటీసు ఇవ్వగా..రెడ్డెప్పశెట్టి వెంటనే కోర్టును ఆశ్రయించారు. తాను రైతుల కోసం బ్రిడ్జి నిర్మించానని... దాన్ని తొలగిస్తే రైతులకు అన్యాయం జరుగుతుందంటూ కోర్టు ఎదుట వాదన వినిపించారు. అయినా ఆరు నెలలు గడువు కావాలంటూ సమయం కోరారు.
- విద్యుత్ చౌర్యానికి సంబంధించి రూ.13 లక్షలు చెల్లించాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు నోటీసు ఇవ్వగా..దీనిపైనా రెడ్డెప్పశెట్టి కోర్టుకు వెళ్లాడు. అంత చెల్లించలేనని, నామ మాత్రం ఇస్తానంటూ కోర్టుకు తెలిపాడు. ఇక తన పొలానికి దారి ఇవ్వలేదని ఓ రైతు చిలమత్తూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసులోనూ ఆయనపై ఇప్పటి వరకూ చర్యలు లేవు. అలాగే రైతులను మోసం చేసి వారి పేరిట డ్రిప్ ఇరిగేషన్ కింద పథకాలు తీసుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి సరిపెట్టారు. ఈడీ అటాచ్ చేసిన లేపాక్షి హబ్ భూములను స్వాధీనం చేసుకుని దర్జాగా అనుభవిస్తున్నా... ఇప్పటివరకూ చర్యలు లేవు.

అధికారుల అంగీకారం వెనుక భారీ డీల్!

భూములు విక్రయించాలని నిర్ణయించుకున్న రెడ్డెప్పశెట్టి...తన అక్రమాలపై ఇప్పటికే నోటీసులిచ్చిన అధికారులకు ఆరునెలలు గడువు ఇవ్వాలని లేఖ రాశారు. అందుకు అధికారులు సూత్రప్రాయంగా ఒప్పుకున్నారు. దీంతో ఆలోపు భూములన్నీ విక్రయించి బయటపడదామని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే బెంగళూరులో ఉంటున్న రెడ్డప్పశెట్టి ఇక్కడి అధికారులను పిలిపించుకుని డీల్ మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా...రెవెన్యూశాఖ కనీసం కోర్టుకు స్థాయి అధికారి సహకరిస్తున్నట్లు ఉద్యోగులే చెప్పుకుంటున్నారు.







బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ, సమన్వయకర్తలు దీపిక (హిందూపురం), దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి (పుట్టపర్తి), ఈరలక్కప్ప (మడకశిర) మక్బుల్ (కదిరి).

పారిశ్రామిక ప్రగతితోనే అభివృద్ధి



జిల్లా పారిశ్రామిక అభివృద్ధిపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలి
- అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశం

ప్రశాంతి నిలయం: "పరిశ్రమల స్థాపనతో ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుంది. అంతేకాకుండా యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. అందువల్ల ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి" అని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ...జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. నూతన పారిశ్రామిక పాలసీకి అనుగుణంగా వ్యవహరిస్తూ జిల్లా ఆర్థిక అభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తగిన ప్రోత్సాహం అందివ్వనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల స్థాపనకు ముందుకువచ్చే వారికి అవసరమైతే బ్యాంకుల ద్వారా రుణం ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పరిశ్రమల స్థాపన కోసం సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులపై సమీక్షించారు. అనంతరం వివిధ పరిశ్రమలకు సంబంధించిన రాయితీలను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. పెట్టుబడి రాయితీ కింద 3 యూనిట్లకు రూ.46.69 లక్షలు, వడ్డీ రాయితీ కింద 3 యూనిట్లకు రూ.1.70 లక్షలు మంజూరు చేశారు. అలాగే వివిధ దశల్లో ఉన్న భారీ, పెద్ద తరహా పరిశ్రమల ప్రగతిపై సమీక్షించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, ఎల్డీఎం రమణ కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి రాధాకృష్ణ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ జిల్లా అధికారి కృష్ణకుమారి, ఏపీఎస్ఎఫ్‌సీ బ్రాంచ్ మేనేజర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు తేవడమే లక్ష్యం



ప్రశాంతి నిలయంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొన్న ప్రతినిధులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న విద్యా వాహిని డైరెక్టర్ కరుణామున్ని



ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం చేసుకుంటున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు

- విద్యావాహిని డైరెక్టర్ కరుణా మున్ని

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఆదర్శాలకు అనుగుణంగా రూపొందించిన విద్యావాహిని ద్వారా గ్లోబల్ విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని విద్యావాహిని డైరెక్టర్ కరుణా మున్ని పేర్కొన్నారు. విద్యావాహిని మూడు రోజుల గ్లోబల్ సమ్మిట్ బుధవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రారంభమైంది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సత్యసాయి విద్యావాహిని ప్రాజెక్ట్‌కు అవసరమైన సాంకేతిక సహకారం కోసం ఐఐటీ మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఒప్పంద పత్రాలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, ఐఐటీ మద్రాస్ ప్రతినిధులు పరస్పరం మార్చుకున్నారు. అనంతరం ప్రశాంతి నిలయంలోని సాయి హీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన సభలో కరుణామున్ని మాట్లాడారు. విద్యావాహిని ద్వారా ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. అలాగే సత్యసాయి ఆశయాలను కొనసాగిస్తూనే... సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందిస్తామన్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలు నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది.

క్లుప్తంగా

మడకశిరలో క్షుద్ర పూజల కలకలం



క్షుద్ర పూజలు నిర్వహించిన దృశ్యం

మడకశిర: స్థానిక 3వ వార్డులోని శివపురంలో క్షుద్ర పూజల కలకలం రేగింది. శివాపురం ప్రాంతంలో నివాసముంటున్న బోయ భారతి బతుకు తెరువు కోసం కిరాణా కొట్టు ఏర్పాటు చేసుకుంది. ఈ క్రమంలో భారతి అంటే గిట్టని వారు ఆమె ఫొటో పెట్టి పసుపు కుంకుమ, కోడి గుడ్లు, నిమ్మకాయలతో మంగళవారం రాత్రి క్షుద్ర ప్రయోగం చేశారు. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన వారు అక్కడి దృశ్యాలు చూసి భయభ్రాంతులకు లోనయ్యారు. ఘటనపై పోలీసులకు బాధితురాలు భారతి ఫిర్యాదు చేశారు.

గురుకుల పాఠశాలలో జారి కిందపడిన విద్యార్థి

కదిరి అర్బన్: మండలంలోని కాళసముద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని డార్మెటరీ రెండో అంతస్తులో మెట్లకలు దిగుతుండగా జారి కిందపడిన విద్యార్థి కార్తీక్‌నాయక్ కుడి చెయ్యి విరిగింది. 6వ తరగతి చదువుతున్న కార్తీక్ నాయక్ రెండో అంతస్తు నుంచి దిగుతూ ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడినట్లుగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి తెలిపారు. క్షతగాత్రుడిని కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రతిభ కనబరిస్తే తల్ సైనిక్ క్యాంపునకు ఎంపిక

- ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎల్‌డీ రాడ్రిక్స్



క్యాడెట్లనుద్దేశించి ప్రసంగిస్తున్న కల్నల్ ఎల్‌డీ రాడ్రిక్స్

కూడేరు: పది రోజుల పాటు కొనసాగే ఎన్‌సీసీ శిక్షణా తరగతుల్లో ప్రతిభ కనబరిస్తే ఢిల్లీలో జరిగే తల్ సైనిక్ క్యాంపునకు ఎంపికవుతారని ఎన్‌సీసీ క్యాడెట్లకు క్యాంప్ కమాండర్ కల్నల్ ఎల్‌డీ రాడ్రిక్స్ సూచించారు. కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ–5 ఎన్‌సీసీ క్యాడెట్ల శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల నుంచి 500 మంది క్యాడెట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో క్యాంప్ కమాండర్ ఎల్‌డీ రాడ్రిక్స్ మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణ మంచి భవిష్యత్తును ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు శారద, సంగీత శశికళ, ఇంద్ర బహదూర్, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం రాసిన మరణ శాసనం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమయపాలనలేని మద్యం విక్రయాలు
- మద్యానికి బానిసవుతున్న యువత
- తాగుడు మానేయమంటే ఆత్మహత్యలే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మద్యం విక్రయాలను ఆదాయ వనరుగా సీఎం చంద్రబాబు మార్చేశారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యం షాపుల నిర్వహణను దక్కించుకున్న 'పచ్చ' నేతలు నిబంధనలు తుంగలో తొక్కి వేళాపాళా లేకుండా విక్రయాలు చేపడుతున్నారు. దీంతో యువత మత్తులో జోగుతోంది. తాగుడు మానేయమని ఇంట్లో వారు ఒత్తిడి చేస్తే మందుబాబులు ఆత్మహత్యలకు వెనుకాడడం లేదు. ఇలాంటి ఘటనలు తరచూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెలుగు చూస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఈ పరిస్థితి లేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎక్కడ పడితే అక్కడ మద్యం విక్రయాలు సాగిస్తుండడంతో తమ పిల్లలు మత్తుకు బానిసలవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది మద్యం రాసిన మరణ శాసనం. ఈ శాసనానికి బుధవారం ఇద్దరు యువకులు బలయ్యారు.



రాజేంద్రప్రసాద్(ఫైల్)

ధర్మవరం అర్బన్: మద్యం తాగొద్దని భార్య చెప్పినందుకు మనస్తాపంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని మార్కెట్‌వీధిలో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... మార్కెట్‌వీధికి చెందిన డ్రైవర్ రాజేంద్రప్రసాద్(30)కు భార్య చంద్రకళ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండేవాడు. తాగుడు మానేయాలని భార్య బతిమాలినా వినేవాడు కాదు. మద్యం మానేయమంటే తాను చనిపోతానంటూ తరచూ బెదిరించేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఇంట్లో ఉన్న రూ.200 నగదు తీసుకుని మద్యం తాగి రాత్రి ఇంటికి తిరిగొచ్చాడు. ఈ విషయంపై భార్య ప్రశ్నించడంతో ఏదో ఒకటి చేసుకుని చనిపోతానంటూ బెదిరించి.. తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి హాల్లో నిద్రించాడు. రోజూ బెదిరించేది మామూలే కదా అనుకుని ఆమె కూడా పిల్లల పక్కన పడుకుని నిద్రపోయింది. బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో భార్యకు మెలకువ వచ్చి చూడగా హాల్లో నిద్రపోతున్న భర్త కనిపించలేదు. వంట గదిలోకి వెళ్లి చూడగా ఫ్యాన్ హుక్కుకు బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న దృశ్యం కనిపించింది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



- గుమ్మఘట్ట: తాగుడు మానేయమన్నందుకు ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం జిల్లా గుమ్మఘట్ట మండలం పైదొడ్డి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాజన్న, లక్ష్మక్క దంపతులకు నలుగురు కుమారులు కాగా, వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవారు. కుమారుల్లో చివరి వాడైన శశికుమార్ (28)కు పెళ్లి కాలేదు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానేయాలని కుటుంబసభ్యులు ఎంత చెప్పినా వినేవాడు కాదు. ఈ నేపథ్యంలో మంగళవారం మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న కుమారుడికి తల్లిదండ్రులు మరోసారి నచ్చచెప్పారు. తాగుడు మానేస్తే ఎవరైనా పిల్లనిచ్చేందుకు ముందుకు వస్తారని ఇప్పటికైనా మద్యం సేవించడం మానేయాలని హితవు పలికారు. దీంతో మనస్తాపం చెందిన శశికుమార్ బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లగానే ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు విషయాన్ని గుర్తించి బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



శశికుమార్ (ఫైల్)

సోషల్ మీడియా మాయలో పడొద్దు

- బాలికలకు ఎస్పీ రత్న సూచన

పుట్టపర్తి టౌన్: సోషల్ మీడియా మాయలో పడి భవిష్యత్తును నాశనం చేసుకోరాదని బాలికలకు ఎస్పీ రత్న సూచించారు. ఈగల్ క్లబ్, శక్తి యాప్ వినియోగంపై బుధవారం కొత్తచెరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు, చిన్న వయస్సులో కలిగే ప్రేమ ఆకర్షణ, గంజాయి వలన కలిగే అనర్థాలపై చైతన్య పరిచారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ మొదలైన సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ చదువులపైనే మనసు పెట్టాలన్నారు. బాలికలు, మహిళలు ప్రమాదంలో ఉంటే 79934 85111 కు సమాచారం అందిస్తే శక్తి టీం సభ్యులు సకాలంలో చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నట్లు తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. బాలికలు అన్ని రంగాల్లో సమాన ప్రతిభతో రాణించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయకుమార్, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, కొత్తచెరువు సీఐ మారుతీశంకర్, ఎస్ఐలు గోపీనాథ్‌రెడ్డి, లింగన్న, కృష్ణమూర్తితో పాటు శక్తిం టీం సభ్యులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

ఐఎంఎల్ డిపోలో హమాలీల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రశాంతి నిలయం: అనంతపురం సమీపంలోని సోములదొడ్డి వద్ద ఉన్న ఐఎంఎల్ డిపోలో లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీలుగా పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న వారు ఆధార్ కార్డు, పోలీస్.. ఎక్సైజ్ పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌తో ధ్రువీకరించిన మెడికల్ సర్టిఫికెట్, విద్యార్హత ధ్రువీకరణకు టీసీ జతపరచిన దరఖాస్తులను జూలై 2వ తేదీలోపు ఐఎంఎల్ డిపో కార్యాలయంలో అందజేయాలి.

పశు సంవర్ధకశాఖ జేడీ నియామకంపై ఉత్కంఠ

అనంతపురం సెంట్రల్: పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ పోస్టు ఎవరికి వరిస్తుందోనని ఉత్కంఠ ఆ శాఖలో నెలకొంది. ప్రస్తుత జేడీ వెంకటస్వామి ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఇప్పటికే ఇన్‌చార్జ్ జేడీగా పశుగణాభివృద్ధి డీడీ సుధాకర్‌కు బాధ్యతలు అప్పగించారు. అయితే రెగ్యులర్ జేడీ పోస్టును దక్కించుకునేందుకు ఇప్పటికే కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఆ జాబితాలో ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా ఉన్న సుధాకర్, ధర్మవరం డీడీ చంద్రశేఖర్‌తో పాటు రాష్ట్ర డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న ప్రేమచంద్ ఉన్నట్లు సమాచారం.

ప్రజావ్యతిరేకత దిశగా 'కూటమి'

- నాటి ఎమర్జెన్సీ చీకటి పాలనను తలదన్నేలా నేడు రాష్ట్రంలో పరిస్థితులు
- మతోన్మాద, నిర్బంధ పాలనపై ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం
- సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ పి.మధు

అనంతపురం అర్బన్: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను మూటకట్టుకుందని సీపీఎం సీనియర్ నేత, మాజీ ఎంపీ పి.మధు అన్నారు. ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం రైల్వేస్టేషన్ నుంచి క్లాక్ టవర్ సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మధుతో పాటు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడారు. నాటి ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో నేడు మతోన్మాద వ్యతిరేక పోరాటానికి సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 1975 జూన్ 25వ తేదీ అర్ధరాత్రిన దేశంలో ఎమర్జెన్సీని అప్పటి కేంద్ర ప్రభుత్వం విధించి 1.13 లక్షల మంది ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయించిందని గుర్తు చేశారు. యాభై ఏళ్ల అనంతరం ఎమర్జెన్సీ చీకటి పాలనను గుర్తు చేసుకుంటే నేడు అంతకంటే ఎక్కువ ప్రమాదకర పరిస్థితి ఉందన్నారు. కార్పొరేట్, మతోన్మాద పాలకుల చేతిలో ప్రజలు నిర్బంధాన్ని చూడాల్సి వస్తోందన్నారు. రాష్ట్రంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. మోదీ ప్రభుత్వానికి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయిందన్నారు. డీసీఎం పవన్‌కల్యాణ్ ద్వారా రాష్ట్రంలో మత రాజకీయాలను బీజేపీ ప్రోత్సహిస్తోందని విమర్శించారు. నిర్బంధ, మతోన్మాద దుష్ట పాలనపై ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటం స్ఫూర్తితో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఐక్య ఉద్యమాల ద్వారానే పేదల సమస్యలకు పరిష్కారం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు జి.ఓబుళు, రామరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు సావిత్రి, జిల్లా నాయకులు బాలరంగయ్య, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మధు

'అనంత'లో వరుస హత్యల కలకలం

అనంతపురం: ఒక్క రోజు వ్యవధిలోనే రెండు హత్యలు చోటు చేసుకోవడంతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. మంగళవారం ఉదయం అనంతపురం నగరంలోని బళ్లారి బైపాస్ రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ పరిసరాల్లో గార్లదిన్నె మండలం కోటంక గ్రామానికి చెందిన రామలింగ కుమారుడు జి.సిదానంద (28) హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మరువకముందే మంగళవారం రాత్రి కుమ్మర నరసాపురం సురేష్ బాబు(43) దారుణంగా హతమయ్యాడు.

శాంతి భద్రతల వైఫల్యానికి నిదర్శనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో శాంతి భద్రతలు లోపించాయనేందుకు నిదర్శనంగా ఇప్పటికే పలు హత్యలు చోటు చేసుకున్నాయి. కేవలం 30 రోజులు కూడా గడవక ముందే మూడు హత్యలు చోటు చేసుకుని పోలీసుల వైఫల్యాన్ని ఎత్తి చూపాయి. నగరంలోని రామకృష్ణ కాలనీకి చెందిన గిరిజన యువతి తన్మయి (19)ని అతి కిరాతకంగా హత్య చేశారు. రాష్ట్రంలోనే ఈ ఘటన కలవరపాటుకు గురిచేసింది. ఈ ఘటన మరువక ముందే అనంతపురం నగరంలో ఒక్క రోజు వ్యవధిలోనే మరో రెండు హత్యలు జరిగాయి.

పోలీసులకే సవాల్ విసిరిన గంజాయి బ్యాచ్

అనంతపురం నగరంలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తోంది. ఏకంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ముందే 'దమ్ముంటే పట్టుకోరా షెకావత్' అంటూ గంజాయి బ్యాచ్ వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడం ద్వారా పోలీసులకు సవాలు విసిరింది. కొన్ని రోజులుగా పుష్ప పాటతో రీల్ చేస్తూ సోషల్ మీడియాలో టాటూ చరణ్ అనే యువకుడు వైరల్ చేశాడు. ఈ నెల 18న అనంతపురంలోని సున్నపుగేరిలో నివాసముంటున్న యశోద ఇంట్లో టాటూ చరణ్, పవన్ చొరబడి డబ్బు కోసం బెదిరించి.. దాడి చేసి దౌర్జన్యంగా సెల్‌ఫోన్ లాక్కెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 21న టాటూ చరణ్, ఇతని అనుచరుడు పవన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరూ ఇది వరకే దొంగతనం, మనుషులపై దాడి కేసులో నిందితులు.



మంగళవారం అనంతపురంలోని బళ్లారి బైపాస్ రోడ్డు వద్ద జరిగిన సిదానంద హత్య స్థలంలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఫైల్)

పని సర్దుబాటులో టీచర్లను కేటాయించండి



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

పుట్టపర్తి అర్బన్: పని సర్దుబాటులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అవసరమున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీఈఓ కిష్టప్పకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాదరెడ్డి, చంద్రశేఖర్ బుధవారం వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. పాఠశాలల పునర్విభజన ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయుల సాధారణ బదిలీల అనంతరం ఏకోపాధ్యాయ పాఠశాలలు, పిల్లల సంఖ్య పెరిగిన పాఠశాలలు, మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొందన్నారు. పని సర్దుబాటులో భాగంగా ఆయా పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. అప్‌గ్రేడ్ అయిన పాఠశాలలకు హెచ్‌ఎం, పీఎస్ హెచ్‌ఎం, ఆదర్శ పాఠశాలల్లో కొత్తగా క్రియేట్ అయిన పోస్టులకు వెంటనే ఐడీలను క్రియేట్ చేసి సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు. స్పాట్ వాల్యుయేషన్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయులకు సాల్ట్, ఎఫ్ఎల్ఎస్ శిక్షణా తరగతులను సెలవు రోజుల్లో నిర్వహించాలని సూచించారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులను వారి నివాసాలకు దగ్గరి మండలాల్లో నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్‌నాయక్, రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, రవిచంద్ర, మండల అధ్యక్షుడు శివయ్య, కౌన్సిల్ మెంబర్ అనిల్‌కుమార్, హెచ్‌ఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్ల సమస్యలు పరిష్కరించండి

- జేసీకి వినతిపత్రం అందజేసిన సర్వేయర్ల అసోసియేషన్ నాయకులు

ప్రశాంతి నిలయం: గ్రామ సర్వేయర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ ఆఫ్ ఏపీ సభ్యులు కార్తీక్, సురేష్, మనోహర్, హరి, బాలాజీ, భాస్కరరెడ్డి మండిపడ్డారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నా నేటికీ తమ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ధ్వజమెత్తారు. గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలంటూ జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు బుధవారం వారు వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. రేషనలైజేషన్, ట్రాన్స్‌ఫర్స్ ప్రక్రియలో ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలతో తీరని అన్యాయం జరుగుతోందని వాపోయారు. భూ సర్వే సమయంలో జనాభా ప్రాతిపదికన కాకుండా భూ విస్తీర్ణం పరంగా హేతుబద్ధీకరణ చేయాలన్నారు. రేషనలైజేషన్‌ను వెంటనే పూర్తి చేసి బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సర్వే విభాగం ఉద్యోగులను టెక్నికల్ ఉద్యోగులుగా గుర్తిస్తూ సొంత మండలాలు కేటాయించాలన్నారు. రీ సర్వే సమయంలో బకాయి పడిన టీఏ, డీఏ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు.

రైల్వే అభివృద్ధికి పాటుపడదాం : డీఆర్‌ఎం

గుంతకల్లు: అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ రైల్వే అభివృద్ధికి పాటుపడదామని ఉద్యోగులకు డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తా పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ప్రతిభ కనిబరిచిన టిక్కెట్ చెకింగ్ స్టాఫ్‌కు మ్యాన్ ఆఫ్ మంత్ అవార్డుల పంపిణీ కార్యక్రమం బుధవారం సాయంత్రం డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా టిక్కెట్ చెకింగ్ స్క్వాడ్ గత నెలలో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసుకున్న దాదాపు 14 మందికి మ్యాన్ ఆఫ్ మంత్ అవార్డులను డీఆర్‌ఎం అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, సీనియర్ డీసీయం మనోజ్, కమర్షియల్ బ్రాంచ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించండి మహాప్రభో

- విద్యుత్ మీటర్ రీడర్ల వేడుకోలు

పుట్టపర్తి టౌన్: మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలంటూ విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్‌ను ఆ శాఖ మీటర్ రీడర్లు వేడుకున్నారు. ఈ మేరకు బుధవారం పుట్టపర్తిలోని ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ సంపత్ కుమార్‌ను కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 20 ఏళ్లుగా మీటర్ రీడర్లుగా తాము పనిచేస్తున్నామని వివరించారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కుటుంబపోషణ భారమైందన్నారు. కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకుపోయినా న్యాయం జరగలేదని వాపోయారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఎస్కో అకౌంట్ ఓపెన్ చేసి జీతాలు చెల్లించేలా చొరవ తీసుకోవాలని కోరారు. డిమాండ్ సాధనలో భాగంగా జూలై 1న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్, రవి, వినోద్, నరేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న మీటర్ రీడర్లు

మామిడి తోటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

తలుపుల: జిల్లా వ్యాప్తంగా మామిడి తోటల రైతులు ఎదుర్కొంటున్న నష్టాలపై 'చేదు మిగిల్చిన మామిడి' శీర్షికన 'సాక్షి'లో వెలుడిన కథనంపై ఉద్యాన శాఖ అధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్థానిక వ్యవసాయాధి హరితతో కలసి ఉద్యాన శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి బుధవారం తలుపుల మండలం టి.రెడ్డివారిపల్లి గ్రామంలో రైతు వెంకటరమణ సాగు చేసిన మామిడి తోటను పరిశీలించారు. రైతులకు నష్టం వాటిల్లిన మాట వాస్తవమేనని నిర్ధారించారు. బీమా, నష్ట పరిహారాల విషయం ప్రభుత్వ బీమా సంస్థల పరిధిలో ఉందని పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: గ్రామీణాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సర్పంచులకు అనంతపురం జిల్లా పరిషత్ క్యాంపస్‌లో గల డీపీఆర్‌సీ భవన్‌లో మూడ్రోజులుగా నిర్వహించిన డివిజనల్ స్థాయి శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ముగింపు సభకు జెడ్పీ సీఈఓ శివశంకర్ అధ్యక్షత వహించగా, చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో పంచాయతీరాజ్ వ్యవస్థ ఒక ప్రధాన భాగమన్నారు. ఇలాంటి తరుణంలో కేవలం ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనంత మాత్రాన లక్ష్యం నెరవేరదన్నారు. పాలనలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని, సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలు అందిపుచ్చుకున్నప్పుడే రాజకీయాల్లో రాణించగలరన్నారు. ఇందుకు సరైన పరిజ్ఞానం, నైపుణ్యత, ఆత్మ విశ్వాసం అవసరమని పేర్కొన్నారు. మహిళా సర్పంచులు తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకొని, గ్రామాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై అవగాహన పెంచుకోగలిగితే పాలనారంగంలోనూ మహిళలు తీసిపోరని నిరూపించినట్లు అవుతుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణను పూర్తి చేసుకున్న మహిళా సర్పంచులకు డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య అభినందనలు తెలిపారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు నాగభూషణ



నిరసన తెలుపుతున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వాన్ని రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు నాగభూషణ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగభూషణ మాట్లాడారు. జీఓ 36 ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. హెల్త్ అలవెన్స్‌లు, రిస్క్ అలవెన్సులు అమలు చేయాలని, ఆప్కాస్ కార్మికులందనీ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి మల్లికార్జున, సీఐటీయూ మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, యూనియన్ నాయకులు రామయ్య, నరసింహులు, కేశవ, రమణ, రామదాస్, బెస్త గంగాధర్, గణేష్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.